క్లుప్తంగా

సమాధుల పండుగకు ఏర్పాట్లు



ఏర్పాట్లు చేస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

దెందులూరు: సమాధుల పండుగ నిర్వహణకు గ్రామాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్‌సీఎం దెందులూరు చర్చి ఫాదర్ జీ.అమ్మన్ రాజా మంగళవారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. సమాధులను శుభ్రం చేసి సమాధుల తోటలో మొక్కలు, గడ్డి తొలగించి లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. నవంబర్ 2వ తేదీన విశ్వవ్యాప్తంగా మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు సమాధుల తోటకు క్రైస్తవులు వచ్చి నివాళులర్పించి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. సమాధులు పండుగకు అన్ని ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయని ఫాదర్ అమ్మన్ రాజా అన్నారు.

ఫాదర్ బాలకు సత్కారం



ఫాదర్ బాలను సత్కరిస్తున్న సంఘ పెద్దలు

దెందులూరు: ఆర్‌సీఎం ఏలూరు పీఠం పరిధిలో 25 ఏళ్ల పాటు వివిధ హోదాల్లో ఆధ్యాత్మిక విద్యా, వైద్య మౌలిక వసతులు కల్పన సేవా రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ పి బాల అభినందనీయులని వేగవరం సంఘ పెద్దలు యువత ఉపాధ్యాయులు అన్నారు. మంగళవారం డాక్టర్ బాలతోపాటు క్రైస్తవ సంఘాల ఐక్యత సంఘాల పెంపు శివారు ప్రాంతాల్లో ఆధ్యాత్మిక ప్రకటనకు కృషి చేస్తున్న వేగవరం ఆర్‌సీఎం చర్చి ఫాదర్ మోజస్‌ను సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

బాణసంచా విక్రయదారులు నిబంధనలు పాటించాలి

భీమడోలు: దీపావళి సందర్భంగా బాణసంచా విక్రయదారులు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని భీమడోలు సీఐ యూజే విల్సన్ హెచ్చరించారు. మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక బాణసంచా దుకాణాలను మంగళవారం సాయంత్రం ఎస్సై వై.సుధాకర్‌తో కలిసి ఆయన తనిఖీ చేశారు. దుకాణాల వద్ద ఫైర్ సెఫ్టీ సిలిండర్, ఇసుక, నీరు తదితర భద్రత, రక్షణ పరికరాలను పరిశీలించారు. వ్యాపారులకు తగు సూచనలందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందుగుండు సామగ్రి విక్రయాల సమయంలో సంబంధిత శాఖల సూచనలతో పాటు జాగ్రత్తలను పాటించాలని కోరారు. అనుమతులు లేకుండా బాణ సంచా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సైలు చలపతిరావు, హెచ్‌సీ ఎస్. శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య విధానానికి విశేష ఆదరణ

ఉంగుటూరు: ఆయుర్వేద వైద్య విధానానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని సర్పంచి బండారు సింధు అన్నారు. ఉంగుటూరు– 1 పాఠశాల ఆవరణలో ఆయుర్వేద దినోత్సవాన్ని, ధన్వంతరి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచి బండారు సింధు, వైద్యాధికారి డాక్టరు కస్తూరి శిరీష, కృష్ణకుమారి, తల్లాప్రగడ భీమేశ్వరరావు, నారాయణం హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు. పంచకర్మ కోర్సు పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

చక్కని ప్రణాళికతో విద్యనభ్యసించాలి

భీమడోలు: భీమడోలు వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో చదువుకున్న పేద విద్యార్థులకు రూ.15వేల పరీక్ష ఫీజును ఓ మహిళ మంగళవారం చెల్లించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. పూళ్ల గ్రామానికి చెందిన విద్యావంతురాలు వర్ధినీడి వెంకటవినుత కళాశాలలోని 15 మంది పేద విద్యార్థులు పరీక్ష ఫీజు నిమిత్తం ఒకొక్కరికీ వెయ్యి రూపాలయ చొప్పున ప్రిన్సిపల్ మాధవికి అందజేశారు. విద్యార్థినీ విద్యార్థులు చక్కని ప్రణాళికతో విద్యనభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆమె విద్యార్థులను కోరారు. వెంకటవినుతను ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

ధాన్యానికి మద్దతు పెంచాలి

ఉంగుటూరు: ధాన్యానికి మద్దతు పెంచాలని కైకరంలో అన్నదాతలు ఆందోళన చేపట్టారు. అన్నదాతలను ఆదుకోవాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో 1.80 లక్షల ఎకరాల్లో వరి పంట సాగవుతోందని, 5.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా వేసి, కేవలం 3.40 లక్షల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రైతు పండించిన పంటలో 60 శాతం మాత్రమే కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం కావడం రైతులకు అన్యాయం చేయడమేనని విమర్శించారు. రైతు పండించిన పంటను పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

పండుగ వేళ.. ధరల మోత

- భగ్గుమంటున్న బాణసంచా రేట్లు
- చుక్కలు చూపిస్తున్న పప్పులు, నూనె ధరలు
- పిండి వంటల తయారీకి మహిళలు దూరం



ఇంటి చుట్టూ ప్రమిదల వెలుగులు



దీపావళి చిచ్చుబుడ్డి

గణపవరం: దీపావళి అంటేనే దీపాల పండుగ. ఇంటి చుట్టూ ప్రమిదల వెలుగులు, దీపావళి బాణసంచా మోతలు, ఇంటినిండా పిండి వంటలు. కొత్త అల్లుళ్ల హడావిడి. బంధుమిత్రులతో సందడి దృశ్యాలు కనిపిస్తాయి. కొండెక్కి కూర్చున్న నిత్యావసర సరకుల ధరలు, చుక్కల సరసన చేరిన బాణసంచా ధరలు, కనీసం పిండి వంటలు చేసుకునేందుకు కూడా ధైర్యం చాలని విధంగా పప్పులు, వంట నూనెల ధరల పెరుగుదలతో దీపావళి పండుగ నానాటికి తన ప్రాభవాన్ని కోల్పోతోంది.

కనుమరుగైన మట్టి ప్రమిదలు

ఒకప్పుడు ఇంటి చుట్టూ, అరుగులు, ప్రహరీ గోడలు, డాబాల మీద పదుల సంఖ్యలో మట్టి ప్రమిదలు పెట్టి ఎంతో ఆనందంగా వెలిగించేవారు. ప్రస్తుతం పెరిగిన నూనె ధరలతో ఆ ప్రమిదలన్నీ మాయమయ్యాయి. ప్రస్తుతం రెండు నుంచి మూడు ప్రమిదలను గుమ్మం ముందు వెలిగించి దీపావళి పండుగ చేసుకున్నాం అనిపిస్తున్నారు.

తోకముడిచిన కొత్త అల్లుళ్లు

దీపావళి పండుగ అంటే కొత్త అల్లుళలదే హడావుడి అంతా. భారీ మందుగుండు సమగ్రితో ఒకప్పుడు అత్తవారింటికి దర్జాగా వచ్చే కొత్త అల్లుళ్లు వాటి ధరల మోతతో బెంబేలెత్తుతున్నారు. కొత్త అల్లుడు వచ్చాడంటే గతంలో ఆ వీధిలో విరామం లేకుండా బాణసంచా మోతలు వినిపించేవి. చుట్టుపక్కల వారంతా ఆ అల్లుడి హడావిడిని కథలుగా చెప్పుకునేవారు. నేడు ఆ పరిస్థితి ఎక్కడా కానరావడం లేదు. బాణసంచా ధరలకు రెక్కలు రావడంతో కొత్త అల్లుళ్లు కాసింత మందుగుండు సామగ్రి మూట కట్టుకుని గుట్టు చప్పుడు కాకుండా అత్తవారింట్లో అడుగు పెడుతున్నారు.

అరకొరగా పిండి వంటలు

దీపావళి పండుగకు రకరకాల పిండి వంటలు చేసుకుని తెలిసిన వారికి, బంధువులకు పంపడం ఆనవాయితీ. ప్రస్తుతం ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. వంట నూనెల ధరలతోపాటు పిండి వంటలకు ఉపయోగించే పప్పులు, ఇతర పచారి సరకుల ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోవడంతో పిండి వంటలను బాగా తగ్గించేశారు. కొందరైతే బజారులో దొరికే రడీమేడ్ స్వీట్లు, పిండి వంటలు తెచ్చుకుని పండుగ అయిందనిపిస్తున్నారు.

దీపావళి పండుగ పిల్లలదే

దీపావళి పండుగ అంటేనే పిల్లల మొహాల్లో ఎక్కడలేని ఆనందం కనిపిస్తుంది. ఎంత బాణసంచా ధరలు మండిపోతున్నా పిల్లల కోసమైనా కొనాల్సిందే. లేకపోతే ఇంట్లో టపాసులను మించిన సౌండ్లు వినాల్సి వస్తుంది. దీనితో కాసింత మందుగుండు సామగ్రి కొందామని బాణసంచా దుకాణానికి వెళ్తే కనీసం వెయ్యి రూపాయలు లేకుండా క్యారీ బ్యాగులోకి మందులు రావడం లేదు. పిల్లలైతే ఫ్యాన్సీ రకాల కోసం మారాం చేస్తే మరో వెయ్యి రూపాయలకు రెక్కలు వచ్చినట్లే.

మండుతున్న బాణసంచా ధరలు

మరోవైపు దీపావళి పండుగ కళ తప్పడానికి కారణం బాణసంచా ధరలు విపరీతంగా పెరగడమే. పండుగకు ఎక్కువగా వినియోగించే అగ్గిపెట్టెలు, కాకర పువ్వొత్తులు, చిచ్చుబుడ్లు, మతాబులు, తాళ్లు, పాము మందు బిళ్లలు, సీమ టపాసుల ధరలు చుక్కలనంటాయి. ఇక రకరకాల ఫ్యాన్సీ బాణసంచా రకాల ధరలు భగ్గుమంటున్నాయి. దీనితో చాలా మంది సామాన్య, మధ్య తరగతి ప్రజలు దీపావళి పండుగ సంబరాలు ఆమడ దూరంలో ఉంటున్నారు.

వినిపించని బాణసంచా శబ్దాలు

గతంలో దీపావళి పండుగ వస్తుందంటే నెలరోజుల ముందునుంచే హడావిడి ప్రారంభమయ్యేది. యువకులు సిసింద్రీలు, మతాబులు, తయారు చేసుకుని, తారాచువ్వలు, చిచ్చుబుడ్లు, తాటాకు టపాకాయలు, పురికొస బాంబులు కొనుగోలులో బిజీగా ఉండేవారు. అలాగే పండుగకు పదిరోజుల ముందు నుంచే బాణసంచా మోతలు వినిపిస్తూ రానున్న పండుగను గుర్తుచేసేవి. దీపావళి తర్వాత మరో వారం రోజుల వరకూ బాణసంచా మోతలు వినిపిస్తూనే ఉండేవి. నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. బాణసంచా కాల్పులు దీపావళి రోజున మాత్రమే కనిపిస్తున్నాయి. అది కూడా రాత్రిపూట గంట సమయం కూడా బాణసంచా మోతలు వినిపించడం లేదు. పండుగ మర్నాడు అయితే అంతా నిశ్శబ్దమే.

నర్సింగ్ కళాశాలలో దీపావళి సంబరాలు



ఓంకారం, శివలింగం ఆకారాలకు దీపాలను అలంకరించిన విద్యార్థులు

దెందులూరు: స్థానిక నర్సింగ్ కళాశాలలో దీపావళిని పురస్కరించుకుని విద్యార్థులు రంగవల్లులు వేసి దీపాలంకరణ చేశారు. మంగళవారం కళాశాల ఆవరణలో ఓంకారం, శివలింగాకారంలో దీపాలను అలంకరించారు. విద్యార్థులు ఒకరికొకరు ఆనందంతో మిఠాయిలు పంచుకున్నారు.

లైసెన్సులు లేకుండా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు

దెందులూరు: ఏ గ్రామంలోనైనా బాణసంచా సామగ్రి నిల్వ ఉంచినా, అక్రమంగా లైసెన్సు లేకుండా ముందుగుండు సామగ్రి అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఆర్.శివాజీ అన్నారు. మంగళవారం దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ బాణసంచా తయారీ విక్రయాల లైసెన్సు కలిగిన వారు ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. పేలుడు పదార్థాలను ఇంట్లో నిల్వ ఉంచరాదని, ప్రభుత్వం మంజూరు చేసిన లైసెన్సులు దుకాణాల్లో మాత్రమే బాణసంచా విక్రయించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో నివాసిత ప్రాంతాల మధ్య బాణసంచా విక్రయించవద్దని హెచ్చరించారు. దుకాణాల వద్ద నీరు, ఇసుక తగినంత నిల్వ ఉంచాలన్నారు. షాపుల వద్ద చిన్న పిల్లలను ఉంచవద్దని సూచించారు. మండలంలో ఏర్పాటుచేసిన బాణసంచా సామగ్రి షాపులపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని ఎస్సై అన్నారు.

ఎస్సీ కమిషన్ ఛైర్మన్‌ను వెంటనే నియమించాలి



అంబేడ్కర్ విగ్రహం నివాళులర్పిస్తున్న అంబేడ్కర్ సంఘ రాష్ట్ర నాయకులు

దెందులూరు: రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ వెంటనే నియమించాలని అంబేడ్కర్ సంఘం రాష్ట్ర నాయకుడు కంభ్రి నరసింహపురంలో మంగళవారం డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దళితులపై హత్యలు, దాడులు, దౌర్జన్యాలు జరుగుతుంటే కూటమి ప్రభుత్వం ఎస్సీ కమిషన్ ఛైర్మన్‌ను నియమించకపోవడంపై అంబేడ్కర్ సంఘం రాష్ట్ర నాయకులు మాంద్రు మధుబాబు తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కావస్తున్న ఎస్సీ కమిషన్ ఛైర్మన్ నియామకం చేపట్టకపోవడం వెనక ఆంతర్యం ప్రజలందరూ అర్థం చేసుకున్నారని వారన్నారు. రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న జరిగిన దాడులకు హైకోర్టు జడ్జితో విచారణ చేయించాలని కోరారు. దాడులు, దౌర్జన్యాల్లో దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. తొలుత వారు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఎల్వోల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఎల్వోల పాత్ర కీలకమని దెందులూరు తహసీల్దార్ బి సుమతి అన్నారు. మంగళవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నియమ నిబంధనలు ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ బీఎల్వోల విధి నిర్వహణపై అవగాహన కల్పించారు. రెవెన్యూ, పోలీస్ ఉద్యోగులతో పాటు ఎన్నికల విధుల్లో ఉన్న అన్ని శాఖల ఉద్యోగులు సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా పనిచేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందేందుకు ఉన్న గడువును పట్టభద్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీఎల్ఓలు గ్రామస్థాయిలో వీఆర్ఏలు విస్తృతంగా ఓటు నమోదుపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ కృష్ణస్వామి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలిని, బీఎల్వోలు ఉన్నారు.

1 నుంచి పశుగణన సర్వే

భీమడోలు: నవంబర్ 1వ తేదీ నుంచి అఖిల భారత పశు సమగ్ర సర్వే చేపడుతున్నామని, రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ జి.నెహ్రూబాబు అన్నారు. భీమడోలు సబ్ డివిజన్ కార్యాలయంలో మంగళవారం నట్టల నివారణ మందు పంపిణీ, పశు గణన అంశాలపై ఏడీ ఇక్కుర్తి సాయి రమేష్ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పశు సంవర్థక శాఖ గణాంకాల ప్రకారం 7.8లక్షల పశువులుండగా సంబంధిత పాడి రైతులు, జంతువుల యాజమానుల ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తామన్నారు. అందులకు అవసరమైన ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్ల నియామకం జరిగిందని, సర్వే చేసేందుకు సర్వే బృందాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 7.8లక్షల పశువులకు చేపట్టిన ఉచిత నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమం ఈనెలాఖరు నాటికి నూరు శాతం పూర్తి చేయాల్సిన బాధ్యత సంబంధిత సిబ్బందిపై ఉందన్నారు. నట్టల నివారణ వ్యాక్సిన్ చేయించుకోవడం ద్వారా పశువులు అనారోగ్యంబారిన పడకుండా ఆరోగ్యంగా పుష్టిగా ఉంటాయన్నారు. ఇప్పటికే 90 శాతానికి పైగా వ్యాక్సిన్ పూర్తి చేసామన్నారు. నట్టల నివారణ వ్యాక్సిన్‌ను ప్రతి ఏటా జనవరి, ఆగస్ట్ నెలల్లో పశువులకు వేస్తామన్నారు. పాడి పరిశ్రమాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాయన్నారు. కార్యాలయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సమాయత్తం కావాలి

భీమడోలు: సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాల్సిన బాధ్యత వీఆర్వోలపై ఉందని భీమడోలు తహసీల్దార్ బి.రమాదేవి అన్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో మంగళవారం సాగు నీటి సంఘాల ఎన్నికల నిర్వహణ, ఎమ్మెల్సీ ఓట్ల నమోదు, రేషన్ సరుకుల పంపిణీ తదితర అంశాలపై వీఆర్వోలు, రేషన్ డీలర్లు, ఎంటీయూ వాహన డ్రైవర్లకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ మాట్లాడుతూ గోదావరి కాలువ పరిధిలోని 10 సాగు నీటి సంఘాల ఎన్నికలకు నవంబర్ 20న నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. అప్పటి ప్రాదేశిక నియోజక వర్గాల వారీగా పారదర్శక ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఓట్ల నమోదుకు ఇప్పటి వరకు 427 మంది దరఖాస్తులు చేశారన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునే దరఖాస్తుదారులు వీఆర్వోల పరిశీలన సమయంలో విధిగా గెజిటెడ్ అధికారి సంతకం చేసిన జెరాక్స్ ప్రతులను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ సుబ్రహ్మణ్యం, సీఎస్‌డీటీ జి.భరత్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ఉంగుటూరు: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, సహకరించిన వారిపై కూడా కేసు నమోదు చేస్తామని ఉంగుటూరు ఎంపీడీవో రాజ్‌మనోజ్ వెల్లడించారు. మంగళవారం ఎంపీడీవో సమావేశపు హాలులో చైల్డ్ రైట్సు అడ్వకసీ ఫౌండేషన్ క్రాఫ్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ అధికారుల సహకారంతో బాల్యవివాహాల నిరోధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను చదివించాలన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు సెల్‌ఫోన్లు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ వంటి సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి కారణంగా ఆడపిల్లలకు చిన్న వయస్సులోనే వివాహం చేస్తున్నారని ఇది చట్టరీత్యా నేరమని అన్నారు. డీవైఈవో రవీంద్రభారతి మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు చైతన్యం కల్పిస్తామని అన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజరు లక్ష్మి మాట్లాడుతూ బాల్యవివాహాల నిరోధానికి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. క్రాఫ్ట్ జిల్లా కోఆర్డినేటర్ రవి బాబు మాట్లాడుతూ చైల్డ్ హెల్ప్ లైను 1098 నంబరుకి ఫోనుచేస్తే బాల్య వివాహాలను అడ్డుకుంటామని అన్నారు. ఏఎస్సై సాంబశివరావు మాట్లాడుతూ మహిళా పోలీసులు నిఘా పెంచాలని అన్నారు. బాలస్వామి, లేబర్ ఆఫీసరు కె.గోపికుమార్, క్రాప్ కోఆర్డినేటర్ ఆర్ వినోద్‌కుమార్, సీహెచ్ రేఖ పాల్గొన్నారు.

మానసిక, శారీరక వికాసానికి క్రీడలు దోహదం



కైకరం హైస్కూల్లో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి



అండర్-14 ఖోఖో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఉంగుటూరు: క్రీడలు విద్యార్థి దశలో మానసిక, శారీరక వికాసానికి దోహదం చేస్తాయని జెడ్పీటీసీ సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి అన్నారు. మంగళవారం కైకరం జిల్లా పరిషత్ హైస్కూల్లో జిల్లాస్థాయి అండర్– 14, అండర్– 17 బాలురు, బాలికల ఖోఖో పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 750 మంది క్రీడాకారులు, 100 మంది పీడీలు హాజరయ్యారు. ఈ పోటీల ప్రారంభ సభలో ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతోపాటు ఆటలపై ఆసక్తి చూపాలన్నారు. హెచ్ఎం గుళ్ల ప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజ్‌మెంటు కమిటీ ఛైర్మన్ అల్లూరి జగదీశ్వరి, సర్పంచి సలగాల గోపి, పాఠశాల కమిటీ వైస్ ఛైర్మన్ ఎస్ బలరాం, మెంబరు బండారు నాగేశ్వరరావు, స్కూలు గేమ్స్ కార్యదర్శి కె. అలివేలు, మంగమ్మ, ఉంగుటూరు నియోజకవర్గ స్కూలు గేమ్స్ కోఆర్డినేటర్ ఎంబీఎల్ నారాయణ, ఏలూరు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు రమేష్, సెక్రటరీ ఎస్ అప్పారావు పాల్గొన్నారు. జిల్లాస్థాయి ఖోఖో ఎంపికలు అండర్ 14 బాలురు, బాలికలు, అండర్-17 బాలురు, బాలికలు, నాలుగు కేటగిరీల్లో 16 మంది చొప్పున, 64 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామని హెచ్ఎం గుళ్ల ప్రసాదరావు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో అండర్-14, అండర్-17 పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

శాంతి భద్రతలను పరిరక్షించాలి

ఉంగుటూరు: ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు.సోమవారం తన క్యాంపు కార్యాలయంలో బెల్టుషాపులు, బ్రాందీషాపులు పెరుగుతున్న నేపథ్యంలో పోలీసు, ఎక్సైజు శాఖ అధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సమీక్షలో ఎమ్మెల్యే మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో పోలీసు సిబ్బంది పాత్ర చాలా కీలకమైనదని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపులు నిర్వహణ, ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరలకు మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో గణపవరం సీఐ సుభాష్, భీమడోలు సీఐ జాన్ విల్సన్ తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సీఐ కల్యాణ్ చక్రవర్తి, భీమడోలు ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

భూ సమస్యలు త్వరితగతిన పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: దెందులూరు మండలంలో వివిధ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ రీసర్వే గ్రామ సభల్లో 212 ఫిర్యాదులు రైతులు అందజేశారని బి సుమతి అన్నారు. మంగళవారం గాలాయగూడెంలో సర్పంచ్ చిలకా వెంకటసుబ్బారావు అధ్యక్షతన మండల సర్వే ఆధ్వర్యంలో రెవెన్యూ రీ సర్వే నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ ఇప్పటివరకు ఇచ్చిన ఫిర్యాదులపై మండల సర్వేయర్, వీఆర్వోలు, వీఆర్ఏలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్లు క్షేత్రస్థాయిలో విచారణ చేస్తారని తెలిపారు. సమస్యలు త్వరగా తన పరిష్కారానికి తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని రైతులు భూ సంబంధిత సమస్యలపై అర్జీలు అందజేయాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణస్వామి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలిని, వీఆర్ఓ దుర్గా, మండల బీజేపీ అధ్యక్షుడు బుజ్జి గోపాల్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వాటర్ కూలర్ వితరణ

దెందులూరు: గాలాయగూడెం గ్రామానికి చెందిన దాత పూజారి సర్వేశ్వరరావు కుమారుడు, స్టార్ దమ్ బిర్యాని రెస్టారెంట్ అధినేత పూజారి సీతారాం వాటర్ కూలర్‌ను స్థానిక గ్రామ పంచాయతీ సచివాలయానికి అందజేశారు. దెందులూరు తహసీల్దార్ బి.సుమతి, సర్పంచ్ చిలకా వెంకటసుబ్బారావు చేతుల మీదుగా పంచాయతీకి దాత వాటర్ కూలర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు పూజారి శ్రీనివాసరావు, పూజారి వెంకటరత్నం నాయుడు, మండూరి బుజ్జి గోపాల్, నాయ కులు పూజారి అచ్చిబాబు, పూజారి యుగంధర్, అక్కల సీతారామయ్య పాల్గొన్నారు.

ముగ్గురి అరెస్టు

ఉంగుటూరు: బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి కోర్టుకు హాజరపరుస్తున్నట్లు ఎస్సై సూర్యభగవాన్ మంగళవారం తెలిపారు. వెల్లమిల్లిలో కంబంపాటి రమేష్ వద్ద నుంచి బీరు సీసాలు 3, క్వార్టర్ బాటిళ్లు, రూ.1,350 నగుదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. చిన్న వెల్లమిల్లికి చెందిన జుత్తిక నాగేశ్వరరావు వద్ద నుంచి ఆరు మద్యం బాటిళ్లు, రూ.1,350 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎ.గోకవరంలో మిరియాల మంగరాజు వద్ద నుంచి 18 మద్య బాటిళ్లు, రూ.6,630 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.